1 నుంచి శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు



- వివరాలు 7లో



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన జామ తోట

పండ్ల తోటల పెంపకం

నత్తనడక

- జిల్లాలో లక్ష్యం 2,400 ఎకరాలు
- కేవలం 55 శాతం విస్తీర్ణంలోనే రైతుల గుర్తింపు
- డ్రాగన్ ఫ్రూట్ సాగుకూ నిధులిస్తున్నారు
- ఉపాధి హామీ పథకం నిధులున్నా ముందుకు సాగని వైనం

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 25: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో పండ్ల తోటలను పెంచి అధిక ఉత్పత్తి సాధించాలనే లక్ష్యం నీరుగారుతోంది. సమృద్ధిగా నిధులున్నప్పటికీ పండ్ల తోటలను పెంచే రైతులను గుర్తించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో లక్ష్య సాధనలో వెనుకంజలో వున్నాము.

కాకినాడ జిల్లాలోని 20 మండలాల్లో 2024-25 సంవత్సరానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2,400 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు కేవలం 55 శాతం విస్తీర్ణంలో మాత్రమే పండ్ల తోటల పెంపకానికి రైతులను గుర్తించారు. రూ.19కోట్లు నిధులు మంజూరు కాగా రూ.8.5కోట్ల విడుదలకు పరిపాలనా ఆమోదం కూడా లభించింది. ఈ నెలాఖరుకు నూరు శాతం లక్ష్యాలను చేరుకుంటారని భావించారు. అయితే రైతుల ఎంపిక ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు వున్న వారికి మెట్ట ప్రాంతంలో ఐదెకరాల విస్తీర్ణంలో పండ్ల తోట పెంపకానికి నిధులు ఇవ్వనున్నారు. మైదాన ప్రాంతాల్లో అయితే రెండున్నర ఎకరాల్లో సాగు చేసేందుకు అవకాశం ఇచ్చారు. రైతులకు ఉచితంగా మొక్కలు ఇవ్వడంతో పాటు అవి ఎదిగే వరకు మూడేళ్ల పాటు ఉపాధి హామీ పథకం నిధులు ఇస్తారు. ఏడాదిలో తొమ్మిది నెలల పాటు ఎకరానికి రూ.2వేలు చొప్పున మొక్కలను రక్షించేందుకు ఇస్తారు. తుని, కోటనందూరు, తొండంగి, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, జగ్గంపేట, పెద్దాపురం మండలాల్లో మెట్ట ప్రాంతం ఎక్కువగా ఉంది. ఇక్కడ పండ్ల తోటల పెంపకానికి అవకాశాలు ఎక్కువగా వున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, కరప, తాళ్లరేవు మండలాల్లో కూడా అవకాశాలున్నాయి.

అవగాహన లేక ముందుకు రావట్లేదు

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి నిధులు ఇస్తున్నారనే అవగాహన లేకపోవడం వల్లే రైతులు పెద్ద ఎత్తున ముందుకు రావట్లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సి ఉంది.

ఏపే మొక్కలు ఇస్తారు

రైతులకు ఈ పథకంలో పది రకాల మొక్కలను పెంపకానికి ఇస్తారు. జామ, మామిడి, జీడిమామిడి, కొబ్బరి, బత్తాయి, సపోట, గులాబీ, మల్లె, మునగ, డ్రాగన్‌ఫ్రూట్ వంటి తోటలను పెంచడానికి అవకాశం ఇచ్చారు. రైతులకు నర్సరీల నుంచి మొక్కలను తీసుకెళ్లడానికి అయ్యే రవాణా ఖర్చులను కూడా ఈ పథకంలో ఇస్తారు.

ఇలా దరఖాస్తు చేయాలి

పండ్ల తోటలను పెంచాలని నిర్ణయించిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, జాబ్ కార్డు జిరాక్స్‌లను గ్రామ సచివాలయాల్లో అందజేయాలి. మండల పరిషత్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేసే సౌలభ్యం కల్పించారు.

పండ్ల డిమాండ్‌ను అనుసరించి పెంపకం


మార్కెట్‌లో పండ్లకు ఉన్న డిమాండును బట్టి మొక్కలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటి వరకు జామ, మామిడి, బత్తాయి ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుత మార్కెట్లో డ్రాగన్‌ఫ్రూట్‌కు డిమాండ్ ఉండడంతో వాటిని కూడా సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు.

సెప్టెంబరు నెలాఖరులోపు లక్ష్యం పూర్తి చేస్తాం

అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ

నిర్దేశించిన లక్ష్యాన్ని సెప్టెంబరు నెలాఖరులోపు పూర్తి చేస్తాం. జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో ఈ పథకంలో నిధులు ఇస్తున్నాం. పండ్ల ఉత్పత్తి, పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో ప్రధానంగా పని చేస్తున్నాం.

- రామేశంమెట్టపై నిరుపయోగంగా జగనన్న లే-అవుట్ ఇళ్ల స్థలాలు
- 59 ఎకరాల్లో 2,114 మందికి స్థలాలు కేటాయించిన గత వైసీపీ ప్రభుత్వం
- ఏళ్లు గడిచినా ఒక్క లబ్ధిదారుడూ ఇంటి పునాది వేయలేదు
- ఆ స్థలాల్లోకి వెళ్లేందుకు ఆనాడే విముఖత
- అయినా చదును పేరుతో రూ.కోట్ల నిధులు వృథా చేసిన వైసీపీ నేతలు
- గ్రావెల్ తవ్వి అగాధాల్లా మార్చేసిన మాఫియా



రామేశంమెట్ట లే-అవుట్

కడితే ఒట్టు!

“ పెద్దాపురం పట్టణ శివారులో సుమారు 823 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది రామేశంమెట్ట. ఇక్కడ ఉన్న లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ మాఫియా అక్రమంగా తరలించేసింది. ప్రస్తుతం అక్కడి పరిస్థితి చూస్తుంటే అగాధాలను తలపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుంది. అయితే ఇటువంటి ప్రదేశంలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణం చేపట్టింది. సుమారు 59 ఎకరాల్లో 2,114 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. వారికి ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు అక్కడ ఒక్క ఇల్లు కూడా కడితే ఒట్టు. ”

(పెద్దాపురం)

గత వైసీపీ ప్రభుత్వం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. పెద్దాపురం మండలంలో 3,965 మంది లబ్ధిదారులను ఆనాడు గుర్తించారు. వీరిలో కొంతమందికి స్థానికంగా స్థలాలు పంపిణీ చేశారు. పులిమేరు, గుడివాడ, సిరివాడ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, చదలాడ, గోరింట, దివిలి, చంద్రమాంపల్లి. తాటిపర్తి తదితర గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాలను రామేశంమెట్ట వద్ద కేటాయించారు. గ్రావెల్ తవ్వేసిన ప్రదేశంలో 59 ఎకరాల్లో ఈ లే-అవుట్ వేశారు. లబ్ధిదారులు నివాసం ఉన్న ప్రదేశం నుంచి సుమారు 11 కిలోమీటర్ల దూరంలో స్థలాలు ఇవ్వడంతో అంత దూరంలో కేటాయిస్తారా అని లబ్ధిదారులు లబోదిబోమన్నారు. ఆ ప్రాంతంలో తమకు స్థలాలు వద్దని ఎంత మొత్తుకున్నా వినిపించుకోకుండా అక్కడే కేటాయించేశారు.

చదును పేరుతో కోట్లు మేసేశారు

రామేశంమెట్ట లే-అవుట్‌ను కొందరు అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. లే-అవుట్ అభివృద్ధి, చదును పేరుతో రూ.కోట్లు మింగేశారు.

పేదలకు స్థలాలు కేటాయించిన తర్వాతా అక్కడి గ్రావెల్‌ను వైసీపీ నాయకుల అండదండలతో అక్రమార్కులు ఇబ్బడిముబ్బడిగా తరలించేశారు. సుమారు 20 అడుగుల మేర తవ్వకాలు సాగించడంతో ఆ ప్రదేశం ప్రస్తుతం లోయను తలపిస్తోంది. ఆ లే-అవుట్ వద్దకు వెళ్లి ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సాహసం చేయలేకపోతున్నారు. ఇదిలా ఉండగా అధికారులు ఈ లే-అవుట్ వైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. తవ్వేసిన ఈ భూముల్లో లే-అవుట్ అభివృద్ధి పేరుతో అప్పటి వైసీపీ నేతలు రూ.కోట్లు దారిమళ్లించినట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.

సుమారు 59 ఎకరాల ప్రాంతాన్ని చదును చేయాల్సి ఉందని, ఇందుకు సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. చదును పేరుతో రూ.కోటికి పైగా బిల్లులు చేసుకుని సర్దేసుకున్నారు.

లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత

రామేశంమెట్ట భూములను కేటాయించడంపై లబ్ధిదారుల నుంచి వైసీపీ నేతలకు ఆనాడే వ్యతిరేకత ఎదురైంది. తమకు ఎటువంటి ఉపయోగం లేని స్థలాలు కట్టబెట్టారని అధికారులు, వైసీపీ నేతలపై అప్పట్లో ఆగ్రహంతో ఊగిపోయారు. స్థలాలు కేటాయించే సమయంలో తమకు అంత దూరంలో వద్దని ఆందోళనలు సైతం నిర్వహించిన సందర్భాలున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు...

పేదలందరికీ ఇళ్లు పేరుతో ఆనాడు స్థలాలు పొందిన వారు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తమకు అన్యాయం జరిగిందని, సుదూర ప్రాంతంలో స్థలాలు కేటాయించారని గగ్గోలు పెడుతున్నారు. వేరే ప్రాంతంలో కేటాయించాలని కోరుతున్నారు.



తారకరామా కాలనీలో అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు



- మామూళ్ల మత్తులో తుని పట్టణ ప్రణాళికా విభాగం

కళ్లు మూసుకున్నాం...

కానిచ్చేయండి

తుని రూరల్, ఆగస్టు 25: కళ్లు మూసుకున్నాం... కానిచ్చేయండి అన్న చందాన ఉంది తుని పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది తీరు. అనధికార, అక్రమ కట్టడాలను ఆ విభాగ అధికారులు అడ్డుకోవట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా వారు చూసీ చూడనట్టు ఉండి మామూళ్ల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. నిబంధనల పేరు చెప్పి అందినకాడికి దండుకోవడంతో ప్రణాళికా విభాగం గాడి తప్పే పరిస్థితి నెలకొంది. ప్లాన్ తీసుకుని అతిక్రమించి కడుతున్న వారు కొందరైతే ఏ ప్లాన్ తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్న వారు మరికొందరు. తుని పురపాలక సంఘ విభాగంలో కింది స్థాయి సిబ్బంది ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ఆరోపణలు ఎదుర్కొనే వారే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణాధికారులుగా కొనసాగుతున్నారు. వార్డు సచివాలయ ప్రణాళికా కార్యదర్శులను, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌లను టీపీఎస్‌లు చెప్పుచేతుల్లో పెట్టుకుని ఆడిందే ఆటగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. సమగ్ర దర్యాప్తు చేపడితే అక్రమాలన్నీ బట్టబయలవ్వడం తథ్యం. అక్రమ కట్టడాల వల్ల ఇప్పటికే తుని పట్టణంలో ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యేలా వున్నాయి. అవి మరింత పేరుకుపోతే భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

తుని పట్టణంలో ప్రధాన కూడలి అయిన గొల్ల అప్పారావు సెంటరును ఆనుకుని వున్న తారకరామా నగర్‌లో సుమారు 100 గజాల స్థలంలో ఎటువంటి అనుమతీ లేకుండా షాపులతో కూడి జీ ప్లస్ భవన నిర్మాణం చకచకా జరిగిపోతుంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో సంబంధిత నిర్మాణంపై అభ్యంతరం తెలుపుతూ ప్రజాప్రయోజనార్థం పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని సంబంధిత అర్జీదారులు చెప్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో అక్రమ కట్టడాల పనులు అడ్డుఅదుపూ లేకుండా సాగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను నిలుపుదల చేసి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.



నృత్యగాన సామ్రాట్ కుమార్ సూర్యనారాయణకు ఆనెం లక్ష్మణరావు స్మారక జీవితకాల పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ఘనంగా ముగిసిన నృత్య నీరాజనం

పోర్టు సిటీ (కాకినాడ), ఆగస్టు 25: కాకినాడ శాస్త్రీయ నృత్య కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల నృత్య నీరాజనం ఆదివారం ముగిసింది. సినిమా రోడ్డులోని సూర్యకళా మందిరంలో ఆనెం లక్ష్మణరావు జ్ఞాపకార్థం నిర్వహించిన నృత్య పోటీలకు రాష్ట్రంలో నలుమూలల నుంచి సుమారు 100 మంది నృత్య విద్యార్థినులు హాజరయ్యారు. పోటీలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రెండో రోజు కార్యక్రమాన్ని ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డాక్టర్ కె.ప్రశోభ్ కుమార్-దేవి దంపతులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించగా లింగమల్లు కృష్ణమూర్తి-విజయలక్ష్మి దంపతులు నటరాజ పూజ చేశారు. ఆనెం లక్ష్మణరావు స్మారక జీవితకాల పురస్కారాన్ని నృత్యగాన సామ్రాట్ కుమార్ సూర్యనారాయణకు అందజేశారు. నిర్వాహకులు ఓవీఎస్ వరప్రసాద్, నాట్యాచార్యులు హరిలోకేష్ శర్మ, ఆనెం ప్రసాద్, నాట్య గురువులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



అన్నపూర్ణను పరామర్శిస్తున్న పురందేశ్వరి

హారిక తల్లికి పురందేశ్వరి ఓదార్పు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన చల్లపల్లి హారిక కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం పరామర్శించారు. కాకినాడ అర్బన్ రెండో డివిజన్ సౌజన్య నగర్‌లోని మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె తల్లి అన్నపూర్ణను ఓదార్చారు. కుటుంబ సభ్యుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియాగా రూ.కోటి ఇచ్చిందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సినవి ఉంటే సత్వరం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పురందేశ్వరి వెంట బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పార్లమెంటు కన్వీనరు రంబాల వెంకటేశ్వరరావు, బి.విశ్వేశ్వరరావు, బీవీ కృష్ణంరాజు, డి.సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, గౌతు చిన్నారావు వున్నారు.

స్వయం సహాయక సంఘాలకు రూ.109 కోట్లు

- 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 25: జిల్లాలో ఆదర్శ మండలాలుగా ఎంపికైన కరప, కాజులూరు, పిఠాపురంలకు రూ.10లక్షలు చొప్పున చెక్కులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదివారం పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలోని జెల్గాన్‌లో మహిళలను ప్రధాని నరేంద్రమోదీ సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకినాడ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, ఎల్డీఎం ప్రసాద్ వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ 'లఖ్‌పతి దీదీ' పథకం కింద అక్కచెల్లెమ్మలను లక్షాధికారులుగా చేయడంతో పాటు మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయ రంగంలో కూడా మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన లక్ష రూపాయల రుణాన్ని ఉపయోగించుకుని జీవనోపాధి పెంచుకోవాలన్నారు. జిల్లాలోని 1041 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన లఖ్ పతి దీదీలకు రూ.109.55 కోట్ల బ్యాంకు రుణాలు పంపిణీ చేశారు. జిల్లాకు 61,697 లఖ్ పతి దీదీలను లక్ష్యం ఇవ్వగా ఇప్పటివరకు 72,681 మందిని గుర్తించి లక్ష్యాన్ని అధిగమించామన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న జేసీ రాహుల్‌మీనా

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

- వివరాలు 7లో

సుద్దగడ్డకు మళ్లీ వరద

- 8లో

గంజాయిపై కూటమి యుద్ధమే



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

2019కి ముందు టీడీపీ ప్రభుత్వం గంజాయిపై యుద్ధమే చేసింది. సాగును నిర్మూలించడమే కాకుండా గిరిజన యువత అటువైపు మళ్లకుండా ప్రత్యామ్నా య ఉపాధి చూపింది. నిరంతర నిఘాతో స్మగ్లర్ల ఆట కట్టించింది. అయితే 2019లో వైసీపీ అధికార పగ్గాలు చేపట్టడంతో మళ్లీ గంజాయి మొక్కలు ఏపుగా పెరిగాయి. గత ఐదేళ్లలో గంజాయి సాగు, రవాణా, వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. గంజాయి పొగ పల్లెల వరకూ పాకేసింది. యువత జీవితాల నూ నాశనం చేస్తోంది. వైసీపీ పాలకుల అండతో తూర్పు అరణ్యం గంజాయి హబ్‌గా మారిపోయింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గంజాయిపై మళ్లీ పోరు ప్రకటించింది. గంజాయిని ఎట్టి పరిస్థితు ల్లోనూ అరికడతామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్ప టికే చెప్పారు. గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని హోంమంత్రి అనిత గట్టిగానే హెచ్చరించారు. మరో మంత్రి సుభాష్ కూడా సమాచారం ఇస్తే రూ.5 వేలు బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు కూటమి ముందున్న పెను సవాళ్లలో గంజాయి నిర్మూలన అధిక ప్రాధాన్యం కలిగిన అంశం. ఈ నేపథ్యంలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్‌కి అవసరమైన సంపత్తిని సమ కూర్చి, సమర్థవంతమైన అధికారిని అధిపతిగా నియమించి రంగంలోకి దిగడా నికి కూటమి పాలకులు సిద్ధం కావడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరం సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇలా గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతు న్నాయి. బహిరంగ మార్కెట్‌లోకి వచ్చేసరికి యువత జీవితాలు నాశనమవు తున్నాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో రిమాండు/ శిక్షపడిన ఖైదీలు సుమారు 600 మంది వరకూ ఉన్నారు. గిరిజనుల కోసం ఉన్న కమిషన్లు, వ్యవస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం గంజాయిపై దృష్టి పెట్టింది. యుద్ధం ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తోంది.

- 'ఆకే' అధిపతిగా ఏఎన్‌టీఎఫ్ రంగంలోకి
- ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక టీం ఏర్పాటు
- మత్తులో యువత జీవితాలు చిత్తు
- పల్లెల్లోనూ గప్పు గుప్పు
- గిరిజన యువతకు ఉపాధి కొరత..
- గంజాయి సాగు.. సరఫరా బాట
- టీడీపీ హయాంలో ప్రత్యామ్నాయంపై చొరవ
- వైసీపీ ప్రభుత్వంలో గంజాయి హబ్
- జైళ్లలో మగ్గుతున్న గిరిజనులు
- ఏజెన్సీలో పోలీసుల ప్రక్షాళనతో అడ్డుకట్ట

● గంజాయి రవాణాలో జిల్లా కీలకం

జిల్లా గుండా హైవే వెళుతుండడంతో రవాణాలో జిల్లా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతూనే ఉంది. గత నెలలో సెబ్ పోలీసులు కాకినాడ నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్న 350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 3న బొమ్మూరు పోలీసులు తమిళ నాడుకు తీసుకెళుతున్న 440కిలోల గంజాయిని పట్టుకున్నారు. దీని రవాణాకు వ్యానుకు ప్రత్యేక అర ఏర్పాటుచేయడం చూసి ఆశ్చర్యపోయారు. శనివారం ఒక్కరోజే జిల్లాలో మూడు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో గంజాయిపై 2019 నుంచి ఈ ఏడాది జూలై చివరివరకూ 288 కేసులు నమోదయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.124 కోట్ల విలువ చేసే 26 వేల కిలోల గంజాయి పట్టుబడింది. 219 రౌడీషీట్లు ఓపెన్ చేయగా, ఆరుగురిపై పీడీ యాక్టు కింద కేసులు పెట్టారు. 201 వాహనాలను స్వాధీనం చేసుకు న్నారు. 590 మంది సరఫరాదారులను గుర్తించి 460మందిని, 401 మంది అమ్మకందారులకు 350 మందిని అరెస్టు చేశారు. వీరిలో 120 మంది వరకూ ఇతర రాష్ట్రాల వాళ్లు ఉన్నారు.

గత ఐదేళ్లగా సాగు చేసుకున్నోడికి సాగు చేసుకున్నంత అనే చందంగా పరిస్థితి మారిపోయింది. అక్రమాలతో అంటకాగిన వైసీపీ పాలకులు తమకు అనుకూలమైన అధికారులను ఆయా పోలీస్‌స్టేషన్లకు రప్పించుకున్నారు. దీంతో గంజాయిసాగు, రవాణా మరింత సులభం అయిపోయింది. తూర్పు మన్యం లోని దట్టమైన అటవీ ప్రాంతంలో సాగు జరుగుతూ ఉంటుంది. ఏవోబీలోనే అని అధి కారులు చెబుతున్నా..మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రా

● పోలీసుల ప్రక్షాళనతోనే

మవరం మండలాలను అనుకొని ఉన్న విశాఖ మన్యంలో గంజాయిని విస్తృతంగా పండిస్తున్నారు. అక్కడి నుంచి ఘాట్ రోడ్డులో నర్సీపట్నం వైపు వెళితే చెక్ పోస్టులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి తదితర మార్గాల్లో గంజాయి రవాణా పాయింట్లకు చేరుతుంది. దీనికి అడ్డుకట్ట పడాలంటే ఏజెన్సీ ప్రాంతంలో పోలీసు, ఫారెస్టు అధికారులు, సిబ్బం ది ప్రక్షాళన సమూలంగా జరగాల్సిందే. కూటమి ప్రభు త్వం ఇంకా దృష్టి సారించకపోవడంతో గంజాయి దందా యథావిధిగా కొన'సాగు'తోంది.





ఇటీవల మోతుగూడెం చెక్‌పోస్టువద్ద అంబులెన్స్‌లో గంజాయి రవాణాచేస్తూ దొరికిపోయిన నిందితులు

కూటమి యుద్ధం ఇలా

గంజాయిపై యుద్ధానికి కూటమి ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీని సిఫార్సులతో గంజాయి, డ్రగ్స్ కట్టడికి యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) అవసరమైన సిబ్బంది, సంపత్తితో రంగంలోకి దిగబో తోంది. మత్తు పదార్థాల నిల్వ, స్మగ్లింగ్, విక్రయాలతో పాటు గంజాయి సాగు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తమ నిఘా విభాగంతో పాటు పోలీస్, ఎక్సైజు, రెవెన్యూ విభాగాల సహకారంతో సేకరి స్తోంది. టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటుచేసి ఖచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి అందజేస్తారు. యాంటీ డ్రగ్ స్క్వాడ్ బృందాలతో గంజాయి సాగును ధ్వంసం చేస్తారు. గంజాయి సాగుతో సంబంధం ఉన్న జిల్లాల సరిహద్దుల్లో పటిష్ట నిఘాతో చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తారు. ఫేషియల్ రికగ్నిజేషన్, ఆటో మేటిక్ నంబరు గుర్తింపు వంటి అధునాతన వ్యవస్థలతో కూడిన సీసీ కెమెరా లను అమర్చుతారు. ఈయుద్ధం కోసం కూటమి ప్రభుత్వం అస్త్రశస్త్రాలతో రంగంలోకి దిగుతోంది. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను ఏఎన్‌టీఎఫ్ అధిపతిగా నియమించింది. ఇద్దరు ఎస్పీలు, నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు ఉంటారు. ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే ఏఎన్‌టీఎఫ్ సెల్‌లో 26 మంది ఎస్‌ఐలతో టీం ఉంటుంది. రెగ్యులర్ ఎస్పీ మొత్తం ఆపరేషన్‌ని పర్యవేక్షిస్తుంటారు. గంజాయి సాగు, సరఫరా, అమ్మకం, వాడకం వంటివి ఇకపై గంజాయి కేసులు అమరావతిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసే ఏఎన్‌టీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేస్తారు. ఈ స్టేషన్లలో డీఎస్పీ ర్యాంకు అధికారితో సహా కిందిస్థాయి సిబ్బంది వరకూ 82 మంది ఉంటారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఏఎన్‌టీఎఫ్ సెల్‌లో పనిచేయడానికి సీఐలు, ఎస్‌ఐలు, ఇతర యూనిఫాం సిబ్బందిని 461 మందిని నియమించు కోవడానికి ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చింది.

● ఐదు నెలల్లో లక్షల ఆదాయం

ఎకరా సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.10లక్షల వరకూ రకం, డిమాండును బట్టి ఆదాయం వస్తోంది. దీంతో సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి అధునాతన సాంకేతికతతో గంజాయి పండిస్తున్నారు. నీటి కొరత రాకుండా కొండ వాగులకు దగ్గరలో సాగు జరుగుతోంది. స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు వినియోగిస్తున్నారు. చీడపీడలకు, బలానికి మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరాకు 500 వరకూ పాదులు పెట్టి ఒక్కో పాదులో 20 వరకూ మొక్కలు నాటతారు. వారంలో మొలకెత్తి నెలలో మొక్క దశకు, ఐదు నెలల్లో పంట చేతికి వచ్చేస్తుంది. తర్వాత గంజాయి ఆకును కోసి ఆరబెడతారు. ఇళ్లలో నాణ్యత, రకం చూపించడానికి కొద్ది మొత్తంలో ఉంచి రహస్య ప్రాంతాల్లో పెద్ద మొత్తాల్లో దాస్తుంటారు. ఆయా ప్రాంతాలకు ఎవరైనా వెళితే ముందుగా ఇంటి వద్ద ఉన్న గంజాయిని మచ్చుకు చూపెడతారు. దీంతో ఏజెన్సీతో పాటు గొర్రెకొండ, నర్సీపట్నం, ప్రత్తిపాడు, తుని తదితర ప్రాంతాలకు చెందిన గిరిజ నేతరులు కూడా ఈ సాగువైపు మొగ్గుతున్నారు. సులభంగా రవాణా చేయడానికి లిక్విడ్, పొడుల రూపంలో కూడా స్థానికంగానే యంత్రాల సహాయంతో తయారు చేసే స్థాయికి గంజాయి సాగు చేరింది.

ఇదిగో 'సాగు'తుంది ఇలా

గత ఐదేళ్లలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్టు, పాడేరు, అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తదితర మండలాల్లో.. ముఖ్యంగా విశాఖను ఆనుకొని ఉన్న జిల్లాల్లో కూడా దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ మారుమూల గ్రామాల్లో 25 వేల ఎకరాలకు సాగు విస్తరించింది. మన్యంలో రూ.2వేల కోట్ల వరకూ ఏడా దికి వ్యాపారం జరుగుతుందని అంచనా. స్థానికంగా గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. పాడేరు, చింతపల్లిలో రూ.5 వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుకుతుంది. కొనుగోలు దారులు చెప్పిన ప్రాంతానికి చేరిస్తే దూరాన్ని బట్టి ధర ఉంటుంది. దళారులు ఆ బాధ్యతను నిర్వర్తిస్తారు. చింతపల్లి, నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం ద్వారా ఎర్రవరం దగ్గర హైవేకు.. సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, రాజమహేంద్రవరం.. చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, భద్రాచలం గుండా తెలంగాణకు రవాణా చేస్తున్నారు. ఏడాది పొడవునా సరఫరా జరుగు తోంది. సామర్లకోట, రాజమండ్రి రైల్వేస్టేషన్ల ద్వారా కూడా గంజాయిని తీసుకె ళ్తున్నారు. తమిళనాడులోని సేలం, ఈరోడ్, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, హైదరా బాద్‌కు ఎక్కువగా వెళుతోంది. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, కర్నాటక, ఒరిసా వంటి సుదూర ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.20 వేలు ముడుతుంది.

గంజాయి నిర్మూలను ఉన్నతాధికారులు ఆప సోపాలు పడుతుంటే స్థానిక సిబ్బంది మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. ఏజె న్సీ మండలాల్లో బేస్ క్యాంపులు ఉంటాయి. పోలీసుల చెక్ పోస్టులు.. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఫారెస్ట్ చెక్ పోస్టులు మండలానికి సుమారు 15వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మ ంగి, చింతూరు, జడ్డంగి తదితర పోలీస్‌స్టేషన్లు రోడ్డుపక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపు లు వాటికి కనిపించవు.

● మామూళ్ల మైకం మామూలే

గంజాయి సాగు, రవాణా వంటి విషయాలు పోలీసు, ఫారెస్టు వాళ్లకు తెలియని తంతు కాదనే వాదనా ఉంది. గంజాయి రవాణాకు సహరిస్తున్న మోతుగూడెం ఎస్‌ఐ, కాని స్టేబుల్ గతంలో అరెస్టయ్యారు. పోలీసులు చూసీచూడకుండా వదిలేయ డానికి 'ఒప్పందాలు' ఉంటాయని స్థానికులు చెబుతుంటారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గ్రామాలు కావడంతో నక్సల్స్ ప్రభావం ఉంటుంది. శాటిలైట్ ఇమేజ్‌లుద్వారా సాగు జరగడంలేదని తెలు స్తోందని పోలీసుల ఉన్నతాధికారులు చెబుతున్నా గంజాయి సాగుకు కలిసొస్తుంది. మైదాన ప్రాంతాలకు తరలి పోతున్న వేల కిలోల గంజాయి ఆ మాటలను వెక్కిరిస్తోంది.





దగ్గుపాటి పురందేశ్వరిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, గుణ్ణం చంద్రమౌళిని సత్కరిస్తున్న బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

నిరుపేదల అభివృద్ధికి చేయూత అందించాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సర్పవరంజంక్షన్, ఆగస్టు 25: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. రాజకీయ కక్షతో విద్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, రంగాలపై పగబట్టి మూసివేయించారు. కమ్మ కులంలో పుట్టడమే నేరంగా దాడులు చేయించి పక్క రాష్ట్రాలకు పారిపోయేలా గత పాలకులు చేశారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు దేశంలో, ఇతర దేశాల్లో ఎక్కడెక్కడ ఉన్నవారంత కలసి వచ్చి సంఘటితంగా తగిన బుద్ధి చెప్పారు. కమ్మ సామాజిక వర్గం వారంతా సంఘటితంగా ఉంటూ హక్కులు సాధించు కుంటూ మనలో ఉన్న నిరుపేదల అభివృద్ధికి చేయూత అందించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యు రాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఆదివారం ఆర్డీవో ఆఫీసు రోడ్డులో గల కాకినాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు చుండ్రు గోవిందరాజు అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందే శ్వరి, టీడీపీకి చెందిన రాజమహేంద్రవరం రూరల్, మండపేట ఎమ్మెల్యేలు గోరింట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావులకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్మ కులం దాతృత్వం గురించి తెలియని వారుండరన్నారు. ఎన్టీఆర్ కమ్మసామాజిక వర్గానికి చెందిన వ్యక్తే అయినా ఒక్క కులానికే కాక యావత్తు ప్రపంచానికి తెలుగువారి ఖ్యాతి తెలిపిన మహోన్నతి వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్ అన్నారు. కులం మనకు బలం కావాలే తప్పా, ఇతర కులాలకు భారం కాకూడదని ఆదర్శంగా నిలవాని కోరారు. మంచి ప్రభుత్వాన్ని, ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సుపరిపాలన అందించే గొప్ప ఆలోచనతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసిన వారందరికీ జరి గిన సన్మానమే ఈ అరుదైన సత్కారంగా భావిస్తున్నట్లు చెప్పారు. వ్యవస్థలను నాసనం చేసి, నియంతృత్వ పాలనతో రాష్ట్రాన్ని సొంత జాగీరులా చేసిన జగన్ పై అనేక పోరాటాలు చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఆడపిల్లల సంఖ్య తగ్గడం మంచిది కాదని యువత సంఖ్య పెంపు కోసం ఆలోచన చేయాలని కోరారు. జగన్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలని, కమ్మవాళ్లను తొక్కేయాలని చేయని ప్రయత్నంలేదని, దాంతో ఎక్కడెక్కడ ఉంటున్న వారంతా వచ్చి సంఘటితమై ఇతర కులాలతో కలసి జగన్‌పాలనకు చరమగీతం పాడార ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి చేతుల మీదుగా గుణ్ణం చంద్రమౌళి, బొడ్డు వెంకటరమణ చౌదరి, మేకా లక్ష్మణ రావు, నెక్కంటి సుబ్బారాయుడు, యార్లగడ్డ వీర్రాజు తదితరులను సత్కరిం చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతబాబు అక్రమాల్లో అధికారులూ పాత్రధారులే

● ఏబీఎన్ లైవ్‌లో ఐపీఎస్, ఐఏఎస్‌లపై ఆరోపణలు చేసిన రంప ఎమ్మెల్యే శిరీష

అమరావతి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 25: అల్లూరి జిల్లా రంపచోడవరం ఎమ్మెల్సీ అనంతబాబు అక్రమాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులూ పాత్రధా రులేనంటూ, గత పదేళ్లలో అనంతబాబు చేసిన అక్రమాలపై రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష ఆరోపించారు. ఆదివారం ఏబీఎన్ లైవ్‌లో పాల్గొన్న ఆమె అనంతబాబు బూతు వీడియో దగ్గర నుంచి ఆయన పాల్పడ్డ అక్రమాల వరకూ చిట్టా విప్పారు. రంపచోడవరం మన్యాన్ని అడ్డాగా చేసుకొని అన్ని వనరులనూ ఆదాయంగా మార్చుకున్నారని, ఇందులో జగన్ ప్రభుత్వ పెద్దల తో పాటు, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖల్లోని ఉన్నతాధికారులు కూడా పాలు పంచుకున్నారన్నారు. ముఖ్యంగా ఆయన అక్రమాల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధి కారులు కూడా భాగస్వామ్యులు కావడం బాధాకరమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా అనంతబాబు ఇక్కడ అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని, నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారని, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అయితే ఆయ నకు అడ్డే లేకుండాపోయిందన్నారు. మొత్తం గత ఐదేళ్లలో జరిగిన భాగోతాల న్నింటిపైనా విచారణ జరిపించాలని ఆమె కోరారు. రంపచోడవరం ఏఎస్పీ తీరుపై కూడా శిరీష ఆరోపణలు చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు బూతువీ డియో కలకలం అయ్యాక, దానిని మార్ఫింగ్ వీడియోగా చెప్పుకుని తనను ఎవరో బ్లాక్‌మెయిల్ చేసి తన వద్ద లక్షలాది రూపాయలు గుంజేశారని, వారి పై చర్యలు తీసుకోవాలని తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని అనంతబాబు కథలు అల్లారన్నారు. నిజానికి ఆరునెలల నుంచి ఒక ఎమ్మెల్సీని ఎవరో బ్లాక్ మెయిల్ చేస్తే, లక్షలాది రూపాయలను గుంజేస్తే వారి ప్రభుత్వంలో ఎటు వంటి చర్యలూ తీసుకోకుండా ఉంటారా అంటూ ఆమె ప్రశ్నించారు. నిజానికి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అంది ఉండదని, అయితే రంపచోడవరం ఏఎస్పీ మాత్రం తనకు వాట్సాప్‌లో ఫిర్యాదు అందిందని చెప్పడాన్ని ఆమె త ప్పుబట్టారు. ఇదిలావుండగా వీధి సుబ్రమణ్యం కేసులో అనంతబాబుతో పాటు ఆయన 12 మంది బృందం పాల్గొంటే కేవలం అనంతబాబు మాత్రం నేరం తనపై వేసుకుని తన బృందాన్ని కాపాడుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. మన్యంలో చోటు చేసుకున్న అక్రమాలన్నిటిపైనా, అనంతబాబు వైఖరిపైనా వ చ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఖచ్చితంగా చర్చించి తగు విచారణతోపాటు బాధ్యు లందరిపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతానని ఆమె చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

తాళ్లరేవు, ఆగస్టు 25: ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు యానాం వెళు తుండగా దారిమధ్యలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువ కుడు మృతి చెందాడు. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన మల్లాడి గంగాధరవర్మ (27) యానాంలో ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు వద్ద 216 జాతీయరహారిపై యానాం నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో తరలించారు. ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

1నుంచి శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు

● వారం రోజులు ప్రత్యేక పూజలు



పిఠాపురం, ఆగస్టు 25: దేశవ్యాప ంగా శ్రీపాదుని జన్మస్థానంగా విరాజి ల్లుతున్న పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకూ శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు జరుగనున్నాయి. వారం రోజులపాటు ప్రత్యేక పూజలు, కా ర్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌తోపాటు ఉత్తరాధి, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు అధికంగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, తీర్థప్రసాద వినియోగం, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీ గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర పారాయణ జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్టాపన, దత్త మంత్ర హోమం, సాయంత్రం 5గంటలకు శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాదపద్మ ములకు వివిధహారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మ ంగళహారతి నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

పుష్పపూజలు

1వ తేదీన ఆదివారం శ్రీపాదశ్రీవల్లభులకు సర్వపుష్ప పూజ, 2న లక్ష బిల్వార్చన, 3న సహస్ర చామంతి పూజ, 4న సహస్ర లిలీ పుష్పపూజ, 5న లక్ష తులసి అర్చన, 6న సహస్ర గులాబి అర్చన, 7న శ్రీపాద జయంతి రోజున పూలంగి సేవ, మారేడుపత్రి పూజ, పూర్ణాహుతి జరుగుతాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌క ల్యాణ్ సూచనలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొ నాలని ఆమె కోరారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

సామర్లకోట, ఆగస్టు 25: సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం విజయవాడ డివిజన్ సీని యర్ కమ్మర్షియల్ మేనేజరు రాంబాబు తనిఖీలు నిర్వహించారు. రైలులో ఐఆర్‌సీటీసీ ద్వారా అందుతున్న ఆహార సదుపాయాలు, ఎమ్మార్పీధరలకే విక్రయాలు జరుగుతుందీ, లేనిదీ తెలుసుకునేందుకు తదితర అంశాలపై ప్రయాణికులనుంచి ఆరా తీశారు. ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సైతం తెలుసుకుని నమోదు చేసుకున్నారు. మెజార్టీ ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌రైలులో మెరుగైన సేవలందించేందుకు ఈ తనిఖీలు దోహదపడతాయాని రాంబాబు చెప్పారు. విజయవాడ నుంచి వందేభారత్ రైలులో సామర్లకోట వరకూ డీసీఎం ప్రయా ణించారు. సామర్లకోటలో దిగి మరో రైలులో విజయవాడ వైపు వెళ్ళే రైలులో తనిఖీల నిమిత్తం సీనియర్ డీసీఎం తరలివెళ్లారు.

కొత్తపేటలో నందమూరి బాలకృష్ణ సందడి

ఒక వివాహ రిసెప్షన్‌కు హాజరు

భారీగా తరలివచ్చిన అభిమానులు

కొత్తపేట, ఆగస్టు 25: ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగమల్లేశ్వరరావు కుమారుడు రిసెప్షన్‌కు కొత్తపేట విచ్చేశారు.ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో జరిగిన వేడుక లకు హాజరై కాసేపు సందడి చేశారు. విషయం తెలియడంతో పెద్దఎత్తున అభి మానులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ బాలకృష్ణను కలిశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి శ్రీ వేంక టేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి స్వాగతం పలికారు.స్వాగతం పలికిన వారిలో పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహరావు, బూసి జయలక్ష్మిభాస్కరరావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ శ్రీనివాస్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అంపైర్‌గా శ్రీనివాస్



అమలాపురం టౌన్, ఆగస్టు 25: బ్యాడ్మింటన్ వర ల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని పూణేలో జరగను న్న ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రి క్స్ మెగా టోర్నమెంటుకు అమలాపురం రూరల్ మం డలం కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ అంపైర్ పా యసం శ్రీనివాస్‌ను న్యాయనిర్ణేతగా నియమిస్తూ ఉ త్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు ఈ టోర్నమెంటు జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఇండియా, చైనా, ఇండోనే షియా, కొరియా, మలేషియా, డెన్మార్క్‌తో పాటు వివిధ దేశాల క్రీడాకారులు ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన టోర్నమెంటుకు న్యాయ నిర్ణేతగా రాష్ట్రం నుంచి శ్రీనివాసరావుకు మాత్రమే అవకాశం దక్కింది. ప్ర స్తుతం ఈయన అయినవిల్లి మండలం నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశా ల ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ కార్య దర్శి అంకమ్మచౌదరి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒ లింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ విద్యాసంస్థల అధినే త బోనం కనకయ్య, గంధం పల్లంరాజు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్ఎం అక్క ల వెంకట్రావు అభినందించారు.

చంద్రబాబు చేయూతతో అద్దంకికి రీజెన్సీ సిరామిక్స్

● యానాంలో తాత్కాలికంగా మూసివేత ● చేయూత ఇవ్వని పుదుచ్చేరి ప్రభుత్వం

యానాం, ఆగస్టు 25: ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు చేయూతతో యానాం రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమ బాపట్ల జిల్లా అద్దంకికి తరలిపోనున్నది. యానాంలో పరిశ్రమను పునఃప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది. పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి ఏవిధమైనా సహకారం లేకపోవడంతో పరి శ్రమను పునఃప్రారంభించేందుకు యాజామాన్యం ముందుకు రాలేదు. ఎన్నో విధాలుగా కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి తగిన సహకారాం లేకపోవంతో యాజమాన్యం ఆంధ్రాకు వెళ్లడానికి నిర్ణయం తీసుకుంది. ఇటీవల సీఎం చంద్రబాబుతో రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు, ఎండీ డాక్టర్ సత్యేంద్రప్రసాద్ సమావేశమ య్యారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వపరంగా చేయూత ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చా రు. దీంతో బాపట్ల జిల్లా అద్దంకికి రీజెన్సీ పరిశ్రమను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్నిరోజులుగా యానాం పరిశ్ర మలో జరుగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

రీజెన్సీ యాజమాన్యం ముందుకు వస్తే ప్రభుత్వంతో చర్చిస్తా : మల్లాడి

యానాంలో రీజెన్సీ పరిశ్రమ యాజమాన్యం ముందుకు వస్తే వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యానాంలో పరిశ్రమ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. యాజ మాన్యం, కార్మికుల్లో పట్టు విడుపులు లేకపోవడంతో దురదృష్టకరమైన సంఘటన చోటుచేసుకోవడం అనంతరం పరిశ్రమ మూతపడిందన్నారు. అప్పుడే తాను నాయకులతో కలిసి హైదరాబాద్ వెళ్లి రీజెన్సీ సంస్థ చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడును కలిసి యానాంలో పరిశ్రమ తిరిగి ప్రారంభించాలని కోరానన్నారు.

డెంగీ జ్వరంతో 25 ఏళ్ల మహిళ మృతి

ద్రాక్షారామ, ఆగస్టు 25: డెంగీ జ్వరంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన అడపా పా వని(25) ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందింది. ఈ నెల 19న అడపా పావని సోదరుడికి రాఖీ కట్టేందుకు తన పుట్టింటికి సంపర వెళ్లింది. జ్వరంతో రావడంతో స్థానికంగా చికిత్స పొందింది. అనంతరం కాకినా డ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 24న సాయంత్రం వెంటిలేటర్‌పై అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. మృతదే హాన్ని బంధువులకు అప్పగించారు. కాగా పావని భర్త గోపాలకృష్ణ మెడికల్ షాపు నిర్వహిస్తుంటారు. వీరికి నాలుగేళ్ల బాలుడు, మూడేళ్ల బాలిక ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్' రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 25: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను రద్దు చేసినట్టు కాకినాడ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.


రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలి : ఎంపీ

కాకినాడ సిటీ, ఆగస్టు 25: మహనీయుల విగ్రహాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. పెదపూడి మండలం కాండ్రేగులలో ఆదివారం జరిగిన వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీవితంలో అనేక ఒడిదిడుకులను ఎదుర్కొని పేదల కోసం పాటుపడిన రంగా నాయకత్వ పటిమ, ఆత్మస్థైర్యం నుంచి మనం ఎంతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, జడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకృష్ణంరాజు, నాయకులు దొరబాబు, సానా శ్రీను, పుట్టా గంగధర్ చౌదరి, దత్తుడు, అద్దంకి ముక్తేశ్వరరావు కృష్ణ, సూర్యకుమారి, వీరాస్వామి పాల్గొన్నారు.

నిజమైన బాధితులకు న్యాయం చేస్తాం : ఎస్‌డీపీవో

కాకినాడ క్రైం, ఆగస్టు 25: కష్టంలో ఉన్న నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసు శాఖ అహర్నిశలూ కృషి చేస్తుందని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు అన్నారు. కాకినాడలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాత్రిపూట నేరాలు, చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశానుసారం రాత్రిపూట గస్తీని ముమ్మరం చేశామన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ బాధ్యతాయుతంగా, పారదర్శకతతో విధులు నిర్వర్తించేందుకు తమతో పాటు తమ సిబ్బంది పనిచేస్తారని భరోసా ఇచ్చారు. తన పరిధిలోని అని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, కేడీ షీటర్లు, జోషియల్ క్రిమినల్స్ (డీసీ)లపై నిఘాను కట్టుదిట్టం చేస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టం లేదా ఆపద వచ్చినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా లేదా నేరుగా తన వద్దకు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

'సంసిద్ధతతో ప్రమాదాల నివారణ'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25: పరిశ్రమల్లో నిరంతర పర్యవేక్షణ, సంసిద్ధత, పునశ్చరణ విన్యాసాలతో పాటూ తగిన భద్రతా ప్రమాణాలు పాటించితే ప్రమాదాలు జరక్కుండా చేయవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్, పీవీ ప్రసన్న తెలిపారు. ఆదివారం కాకినాడ బీచ్ వాకలపూడిలో ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ బృందం ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్ సంస్థ టెర్మినల్‌ను తనిఖీలు చేపట్టారు. ఆయిల్, గ్యాస్ పరిశ్రమలో ఎమర్జెన్సీ ప్రిపేర్‌నెస్‌పై నిర్వహించిన అవగాహన, విన్యాసాల కార్యక్రమంలో ఆధ్వర్యంలో శిక్షణ, వివిధ సామర్థ్యాల ప్రదర్శన, ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహించారు. పెట్రోలియం ఉత్పత్తులు, చమురు గ్యాస్ పరిశ్రమల్లో విపత్తులు, ప్రమాదాల నివారణ కోసం నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉండాలన్నారు. ఎన్‌సీఎస్ సంస్థ జీఎం ఎం.విజయ కుమార్, డిపో ఇన్‌చార్జి కిరణ్ బనియా, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'సాహిత్యంతో సమాజాభివృద్ధి'

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 25: సాహిత్యంతో సమాజాభివృద్ధి జరుగుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు టి.విశ్వనాథం అన్నారు. రామారావుపేటలోని వద గాయత్రి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి శ్రీశ్రీ మెమోరియల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి శ్రీపాద శ్రీరామమూర్తి శత జయంతి సభ జరిగింది. అతిథులుగా విశ్రాంత ఆచార్యుడు విశ్వనాథం, ప్రముఖ కవి గరికపాటి మాస్టారు, యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఉపాధ్యక్షుడు పట్నాల రాము హాజరయ్యారు. విశ్రాంత తహశీల్దారు, కవి కొరుప్రోలు గౌరీనాయుడు అధ్యక్షతన జరిగిన సభలో పలువురిని ఘనంగా సత్కరించారు. కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకుడు శ్రీపాద సత్యనారాయణమూర్తి, శ్రీపాద సూర్యప్రకాశరావు, గరిమెళ్ల ఉషాకుమారి, ఆకాశవాణి గాయకుడు కారక రాజబాబు, పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'మాతృభాషను కాపాడుకోవాలి'

పెద్దాపురం, ఆగస్టు 25: మాతృభాషను కాపాడుకోవాల్సి అవసరం సమాజంలో ప్రతీఒక్కరిపైనా ఉందని సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. దాడి చంద్రశేఖరరావు, బాలిన నూకరాజు, నళిని తదితరులు ఉన్నారు.

'మానవ మనుగడకు భగవద్గీత దోహదం'

కాకినాడ సిటీ, ఆగస్టు 25: భగవద్గీతలోని ప్రతి అధ్యాయం మానవ మనుగడకు దోహద పడుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో రామారావుపేటలోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇస్కాన్ జోనల్ ఇన్‌చార్జి గురుదాస్ భగవద్గీత పుస్తకాన్ని ఎమ్మెల్యే కొండబాబుకు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం

ప్రత్తిపాడు, ఆగస్టు 25: ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించిన ఉత్తర్వులు ఆసుపత్రికి ఆదివారం అందాయి. కమిటీ గౌరవ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, గౌరవ మెంబర్‌గా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ఆసుపత్రి సూపరింటిండెంట్ డా.సౌమ్య షైకేల్, సభ్యులుగా వి.కొండలరావు, బి.వెంకటేశ్వరరావులు ఎంపీడీవో, ప్రత్తిపాడు గ్రామ కార్యదర్శులు ద్విబాష్యం శ్రీనివాస్‌లను నియమిస్తూ ఆదేశాల్లో కలెక్టర్ పేర్కొన్నారు. నూతన కమిటీతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటిండెంట్ సౌమ్య తెలిపారు.

సీపీఆర్ శిక్షణపై అవగాహన సదస్సు

గండేపల్లి, ఆగస్టు 25: మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల,మెడికోవర్ కాకినాడ హాస్పిటల్స్ సంయుక్తంగా సీపీఆర్ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ విజెసిహెచ్ జయప్రకాష్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇన్నోవేషన్ సర్జికల్ టెక్నాలజీలో గల ఆధునిక పోకడలు, వెరికోస్‌కు గల లక్షణాలు, చికిత్స పద్ధతులను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకెఎస్ సుబ్బారావు,డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ కిషోర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ఏలేశ్వరం, ఆగస్టు 25: పట్టణంలో క్వారీ పేటలో అగ్ని ప్రమాదంలో తాటికిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన సూరిబాబు కుటుంబానికి పట్టణానికి చెందిన వాగు రాజేష్ తనయుడు సాత్విక్ జన్మదినం పురస్కరించుకుని సుమారు రూ.15 వేలు విలువ చేసే వంట సా మాగ్రి, దుస్తులు, 25కేజీల బియ్యం, నిత్యావసర సరులకులతో పాటు దాతలు రూ.10 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో బుగతా శ్రీను, రాడ్ల బుజ్జి, వివేకానంద సేవా సమితి పట్టణ అధ్యక్షుడు, సిరి ఫుడ్స్ అధినేత పెచ్చేటి కృష్ణ, కొత్త బాబా, అనంతపల్లి శ్రీను, రాతికింద సతీష్, వంకాయల సత్తిబాబు తదితరులున్నారు.

సామూహిక సరస్వతీ దేవి పూజలు

సామర్లకోట, ఆగస్టు 25: హుస్సేన్‌పురంలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం ఆవరణలో సీతారాముల మందిరం వద్ద ఆదివారం మహిళలతో సామూహిక సరస్వతీ దేవి, నటరాజ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలో 2నెలలుగా కోలాటనృత్య శిక్షణ పూర్తి చేసిన మహిళలు కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు గుణ్ణం వీర్రాజు, కంటే చంటిబాబు, కట్టా రాంబాబు, మోదమూను ప్రసాద్, జీ.సత్తిబాబు, పలివెల చంద్రశేఖర్, సత్యనారాయణ, గుడాల గణేష్, చల్లా బుజ్జి,కోట అప్పారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోటనందూరు, ఆగస్టు 25: శ్రీలోవ తలుపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 40 మంది విద్యార్థులు, ఆరుగురు గురువులు, ముగ్గురు స్కూల్ అభివృద్ధి దాతలు పాల్గొన్నారు. స్కూల్ ఆవరణలో 2కొబ్బరి మెక్కలను నాటారు. వాహన ప్రమాదంలో ఆకస్మాత్తుగా మృతిచెందిన తమ స్నేహితుడు షేక్ నవాబ్‌జానీ భార్య, ముగ్గురు ఆడిపిల్లలకు రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామపెద్దలు ఉమారావు, బిజసాహెబ్, బషీర్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పిఠాపురం రూరల్, ఆగస్టు 25: పిఠాపురం మండలం బిప్రత్తిపాడు పీఎంఆర్ విద్యామందిర్‌లో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు అందరిని అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ నాగినిచంద్ర, డైరెక్టరు విజయకుమార్, చైర్మన్ వినీల్‌వర్మ పాల్గొన్నారు.

మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలి

» పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » పలుచోట్ల లఖ్‌పతీ దీదీ కార్యక్రమాలు » మహిళా సంఘాలకు చెక్కుల అందజేత



సామర్లకోటలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, ఏలేశ్వరంలో చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

సామర్లకోట, ఆగస్టు 25: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శక్తిసంఘాలకు అందిస్తున్న పలు రుణ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ఏపీఎం ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ప్రధానమంత్రి లఖ్‌పతీ దీదీ ఫెలిసిటేషన్ జూమ్ సమీక్షా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సంఘంలో ఉన్న ప్రతీ సభ్యురాలు లక్షాధికారి కావాలని తద్వారా కుటుంబ ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగవుతాయన్నారు. బ్యాంక్ లింకేజీల ద్వారా లక్‌పతి దిది వ్యాపారాలు చేసుకునే మహిళా సభ్యులు 34 సంఘాలకు చెంది రూ.4.45 కోట్ల మేర రుణాలకు చెంది నమూనా చెక్కును రాజప్ప అందజేశారు. మండలంలో ఆయా గ్రామాల్లో లక్‌పతి దిది సభ్యులలో బెస్ట్ యాక్టివిస్టులుగా ఎంపికైనవారికి ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనుబాబు, విష్ణుమూర్తి, జ్ఞానరత్నం, శాంతికుమారి, ఎంఎస్‌పి శ్యామ్ సుధాకర్, ఎం.నాంచారమ్మ, పి.లోవకుమారి పాల్గొన్నారు. సామర్లకోట-పెద్దాపురం పట్టణాలను కలుపుతూ గత టీడీపీ హయాంలో చేపట్టిన సామర్లకోట రింగ్ సెంటర్ వద్ద గడియారం స్తంభం పనులను పునర్నిర్మాణం చేపట్టేందుకు సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌తో శ్రీవిద్యతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డు వెంబడి ట్రాఫిక్‌కు అవరోధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించే ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు.

పెద్దాపురం: లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా పొదుపు సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడారు. 118 మహిళా సంఘాలకు రూ.8.50 కోట్ల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, దేవళ్ల సతీష్ ఏపీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రతీ మహిళను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో వీవోఏలతో లఖ్‌పతీ దీదీ కార్యక్రమాన్ని వెలుగు ప్రాజెక్టు అధికారి సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీనేతలు టేకుమూడి లక్ష్మణరావు, నడిపల్లి వినోద్, పొన్నమండ రామలక్ష్మి, ధూళిపూడి వెంకటరమణ, గంగాధర్ పాల్గొన్నారు.

తుని రూరల్: పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ యువనేత యనమల రాజేష్ స్పష్టం చేశారు. తుని మండల వెలుగు కార్యాలయంలో లఖ్‌పతీ దీదీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వయం సహాయక సంఘాల సభ్యులకు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, దాయాల రామకృష్ణ, ఎంపీపీ బొప్పన రాము పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మహిళలకు స్వయం జీవనోపాధి కల్పనే ధ్యేయంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో లఖ్‌పతీ దీదీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ గ్రూపు సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట శ్రీధర్, సుబ్బరాజు, జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి, టీడీపీ నాయకులున్నారు.

'ఏ ప్రాతిపదికన అవార్డులు పంపిణీ చేశారో చెప్పాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25: లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులకు ఏ ప్రాతిపదికన అవార్డులు పంపిణీ చేశారో చెప్పాలని, మండల ఉత్తమ వీవోఏ కింద తనను ఎంపిక చేసి అవార్డు ఇవ్వకుండా అవమానానికి గురిచేసిన డీఆర్‌డీఏ పీడీ, డీపీఎంలు సమాధానం చెప్పాలని మండల వీవోఏల సంఘం, జిల్లా వీవోఏల సంఘం అధ్యక్షురాలు కందా గంగాభవానీ డిమాండ్ చేశారు. ఆదివారం రమణయ్యపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో మండలంలో సుమారు 20 మంది వ్యాపారాలు చేసుకునే మహిళలకు అవార్డులిస్తామని చెప్పారని, అలాగే ఉత్తమ సేవలందించినందుకు పండూరు వీవోఏగా తన పేరు ప్రతిపాదించి, ఉత్తమ ప్రసంసాపత్రం తీసుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి రావాలని సెర్ప్ అధికారులు చెప్పగా ఆదివారం కార్యాలయానికి వెళ్లానని, సెర్ప్‌లో పనిచేస్తున్న డీపీఎంలకు అనుకూలంగా ఉండేవారికి ముందుగా జేసీ చేతులమీదుగా ప్రసంసాపత్రాలు పంపిణీ చేయించారన్నారు. తనకు ఉత్తమ ప్రసంసాపత్రం జేసీ చేతుల మీదుగా ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా డీపీఎంలు పీడీవో కలసి అడ్డుకుని అవమానించారని ఆరోపించారు. సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేదిలేదన్నారు. ఆమెకు సంఘీభావంగా వీవోఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆందోళనకు దిగిన వీవోఏ గంగాభవాని

సుద్దగడ్డకు మళ్లీ వరద


జగనన్న కాలనీ రహదారిపై ప్రవహిస్తున్న నీరు

గొల్లప్రోలు, ఆగస్టు 25: సుద్దగడ్డకు మళ్లీ వరద నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా పడుతున్న వర్షాలతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ) కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద నీరు పట్టణ శివారు జగనన్న కాలనీ రహదారిపైకి చేరింది. సుమారు మూడున్నర అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం వరద నీటిలో జగనన్న కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ వరద ఉధృతి పెరుగుతూనే ఉంది. ఏ మాత్రం వర్షం కురిసినా రోడ్డు మీద నీరు ప్రవహిస్తున్నదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అధిక వర్షాలు పడితే కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా ముంపునకు గురవుతుందని, దీంతో బోటు మీద ప్రయాణాలే తమకు శరణ్యమవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుంటే ఇటువంటి ఇబ్బందులు వర్షాలు కురిసిన ప్రతిసారీ తప్పవని వారు తెలిపారు.

టోల్‌గేట్ వద్ద ఆందోళన

కిర్లంపూడి, ఆగస్టు 25: కృష్ణవరం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొదిరెడ్ల సుబ్బారావు మాట్లాడుతూ తమ గ్రామంలో జాతీయరహదారి 16ను ఆనుకుని టోల్‌గేట్ పక్కనే ఎస్సీపేట ఉంది. వర్షాకాలం వస్తే జాతీయరహదారిపై నీరంతా ఎస్సీపేటలో చేరుకుని ముంపునకు గురవుతుందని, పరిష్కారం చూపాలని కోరారు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ టోల్‌మేనేజర్, ఆందోళన కారులతో చర్చలు జరిపారు. 2రోజుల్లో ఎస్సీపేట వద్ద రోడ్డు ఎత్తు పెంచుతామని, భవిష్యత్‌లో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అనడంతో ఆందోళన విరమించారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

తుని రూరల్, ఆగస్టు 25: తలుపులమ్మలోవ క్షేత్రానికి ఆది వారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయ ఈవో విశ్వనాధ్ రాజు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ విభాగాల ద్వారా రూ.3.67లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయాధికారులు తెలిపారు.

ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి

పిఠాపురం, ఆగస్టు 25: ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. కొద్ది రోజులుగా ముసుగు వాతావరణంతో సేదతీరిన ప్రజలకు ఆదివారం ఉద యం నుంచే ఎండ ప్రారంభమయి షాక్ ఇచ్చింది. మధ్యాహ్నానికి వేడిగాలులు వీయడంతో ప్రజలు ఇబ్బం దులు పడ్డారు. పిఠాపురంలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం వరకూ ఎండ తీవ్రత తగ్గలేదు.

వెనక్కి వెళ్లిన సముద్రం

కొత్తపల్లి, ఆగస్టు 25: ఉప్పాడ తీరంలో సముద్రం బాగా వెనక్కి వెళ్లింది. గత 4 రోజుల నుంచి రోజుకి కొంచెం,కొంచెంగా వెనుక్కి తగ్గుతూ వెళ్తుంది. బీచ్‌రోడ్డుకు అతి దగ్గరలో ఉండే సముద్ర కెరటాలు సుమారు 80 మీటర్ల దూరం వరకు వెనక్కి వెళ్లాయి. తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడే ముందు సముద్రం బాగా వెనక్కి తగ్గుతుందని, ఆయా సూచనల ప్రకారం వేటకు వెళ్లేది లేనిది నిర్ధారించుకుంటామని మత్స్యకారులు చెప్తున్నారు.


ఉప్పాడ తీరంలో వెనక్కి వెళ్లిన సముద్రం

ఫీవర్ సర్వే సమర్థవంతంగా చేపట్టాలి

డీఎంహెచ్‌వో నరసింహనాయక్

పెద్దాపురం, ఆగస్టు 25: ఫీవర్ సర్వేను సమర్థవంతగా చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులను డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఆదేశించారు. మండలంలోని చదలాడ, తిరుపతి గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. డోర్ టు డోర్ ఫీవర్ సర్వే ఏవిధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే విషయంలో అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే వైద్య శిబిరాలను నిర్వహించాలని, బృందాలుగా సర్వేను చేపట్టాలన్నారు. జ్వరంతో బాధపడే అనుమానితులను సమీపంలో ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.


చదలాడ ప్రభుత్వ పాఠశాల వద్ద సర్వే వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

వణికిస్తున్న విషజ్వరాలు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు వణికిస్తున్నాయి. గడచిన నెలరోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు విషజ్వరాల బారిన పడి మృత్యువాతకు గురయ్యారు. ఈ విషయంలో వైద్య ఆరోగ్యశాఖాధికారులు గోప్యంగా ఉంచడంతో పరిస్థితి మరీ ఆందోళన కలిగిస్తోంది. మండల పరిధిలోని తిరుపతి, దివిలి, కాండ్రకోటగ్రామాలకు చెందిన జాన్ విక్టర్ (14), వి.కృపారావు (16), పి.హేమసత్యశ్రీ (10) మృత్యువాతకు గురయ్యారయ్యారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పారిశుధ్యలోపం, విషజ్వ రాలపై అవగాహనలేమి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. వైరల్ జ్వరాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కష్టపడి పని చేసేవారికి సముచిత స్థానం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల


నాయకులతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, ఆగస్టు 25: కష్టపడి పని చేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం ఉందని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట క్యాంపు కార్యాలయంలో తుని మండలానికి చెందిన టీడీపీ కీలక నేతలతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో గ్రామాలవారీ టీడీపీకి లభించిన మద్దతు, ఓట్లు చీలిన గ్రామాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజా మన్ననలు పొందేలా నాయకులు మెలగాలని.. ప్రజలతో మమేకమై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులకు సూచించారు. ప్రధానంగా మండలంలో తాగు నీటి సమస్యను పరిష్కరించింది టీడీపీ ప్రభుత్వమేనని ఫలితంగా నియోజకవర్గంలో తొండంగి మండలంలో 2పంటలు పండే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూసుకునే తమదని ప్రజా అవసరాలు గుర్తించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పలకా సోమేశ్వరరావు, కరపా అప్పారావు, గజ్జి అప్పలరాజు, దూలం మాణిక్యం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'ఆధునిక వైద్యాన్ని అందించాలి'

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 25: సంతాన లేమితో బాధపడుతున్న వారి కోసం పునరుత్పత్తిలో సాంకేతికతను పెంపొందించేందుకు ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా కాకినాడ శాఖ ఆధ్వర్యంలో అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ)లోని పురోగతిపై నిరంతర వైద్య విద్య (సీఎంఈ)ను ఆదివారం నిర్వహించారు. కాకినాడ జీఆర్టీ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఏయూ ఎమిరిటస్ ప్రొఫెసర్ డాక్టర్ జీపీ రామరాజు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పునరుత్పత్తి వైద్యానికి మరింత సాంకేతికతను జొప్పించి నూతన మెళకువలతో ఆధునిక వైద్యాన్ని అందించాలన్నారు. ఆలస్యంగా వివాహం, అధిక బరువు, మద్యం తాగడం, పొగ తాగడం, చిన్నతనంలోనే వివాహం చేయడం సంతాన లేమికి ముఖ్యకారణాలన్నారు. కార్యక్రమంలో సంఘ కాకినాడ శాఖ కార్యదర్శి డాక్టర్ ఏఎల్ సత్యవతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ గీతాశ్రీ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ విజయ, డాక్టర్ కిన్నెరవీణ,డాక్టర్‌నందేశ్వరి ఉన్నారు.

'మెడికల్, హెల్త్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి'

కాకినాడ సిటీ, ఆగస్టు 25: దీర్ఘకాలికంగా ఉన్న మెడికల్, హెల్త్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ తెలుగునాడు మెడికల్-హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు పేర్కొన్నారు. యూనియన్ (టీఎన్టీయూసీ అనుబంధం) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం కాకినాడలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జోనల్ ఇన్‌చార్జి సబ్బతి ఫణీశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక ప్రభుత్వ మని, వారికి మంచిరోజులు వచ్చాయన్నారు. తెలుగునాడు మెడికల్-హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వై.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీఎస్ వర్మ, జనరల్ సెక్రటరీగా కె.వీరబాబు, ట్రెజరర్‌గా డీఎల్ గంగాధరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా పీవీ రామరాజు, ఎన్‌వీఎస్ భాస్కరరామశర్మ, పిల్లి ప్రసాద్, కె.శామ్యూల్‌రాజు ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మీ, టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, సచివాలయ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

వేడుకగా సత్యదేవుడి రథోత్సవం


సత్యదేవుడి రథసేవలో పాల్గొన్న భక్తజనం

అన్నవరం, ఆగస్టు 25: రత్నగిరివాసుడైన సత్యదేవుడి రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన టేకురథంపై ఆశీనులు గావించి పండితుల ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మున్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి రామారావు, ఏపీఆర్వో గణపతి తదితరులున్నారు.

రూ.లక్ష విరాళం



అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కాకినాడకు చెందిన డి.పట్టాభి రూ. 1,00,116 విరాళంగా అన్నదాన విభాగ సూపరెంటెండెంట్ కంచి మూర్తికి అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనంతో పాటు ప్రసాదాలందజేశారు.

ధర్మవరంలో మెగా వైద్యశిబిరం


నేత్ర పరీక్షల విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, ఆగస్టు 25: మండలంలోని ధర్మవరం ఆదర్శ విద్యాలయ ప్రాంగణంలో ఆదివారం స్థానిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. పేదల ఆరోగ్యం కోసం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 15 విభాగాలతో వైద్య బృందాలను శిబిరం నిర్వహించడం అభినందనీయన్నారు. కాకినాడకు చెందిన ప్రముఖవైద్యులు ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 15 మంది వైద్యులు కంటి, ఎముక, జనరల్, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, గైనిక్, షుగర్, బీపీ తదితర విభాగాలకు చెందిన 1600 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ కరస్పాండెంట్ దాడి చిన్నారావు, కూటమి నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, దాసం శేషారావు, ఊటా వీరబాబు, సానా నూకరాజు, గొంతిన సురేష్, కొప్పన రాజబాబు తదితరులున్నారు.

కాకినాడలో హాకీ పోటీలు

కాకినాడ అర్బన్, ఆగస్టు 25: హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ అన్నారు. ఇందులో భాగంగా ఈ నెలాఖరు వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం డీఎస్‌ఏ మైదానంలో హాకీ పోటీలను ప్రారంభించారు. హాకీ కోచ్ రవిరాజు, బి.నాగేంద్రకుమార్ ఉన్నారు.

మరిడమ్మ వెండిపాదం చోరీ

అన్నవరం, ఆగస్టు 25: గ్రామంలో రైల్వేస్టేషన్ రోడ్డులో కొలువైఉన్న మరిడమ్మ అమ్మవారి వెండిపాదం శనివారం రాత్రికి చోరీకి గురైంది. కమిటీ సభ్యులు ఆదివారం గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సీసీ కెమెరాలు ఆ సమయంలో పనిచేయకపోవడంతో అక్కడ సంచరించే వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు.

సెల్‌ఫోన్ చోరీ చేస్తూ చిక్కాడు!

కిర్లంపూడి, ఆగస్టు 25: మండలంలోని గోనేడ గ్రామంలో సంతలో ఒక వ్యక్తి వద్ద దొంగ సెల్‌ఫోన్ దొంగతనం చేస్తుండగా చుట్టుపక్కల వారు గుర్తించి ఆ దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. పెద్దాపురం క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అక్కడికి చేరుకుని దొంగను తీసుకెళ్లారు. అయితే ఇటీవల సెల్‌ఫోన్‌దొంగలు ఎక్కువయ్యాయని గ్రామస్తులు చెబుతున్నారు.

ఘనంగా గంగాలమ్మ జాతర

పిఠాపురం రూరల్, ఆగస్టు 25: పిఠాపురం మండలం జల్లూరులో గంగాలమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాత్రంతా జాతర అనంతరం అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులకు రూ.5వేలు విరాళంగా అందజేశారు.

దుర్గమ్మ ఆలయం కిటకిట

గండేపల్లి, ఆగస్టు 25: మండలంలో మురారి గ్రామ శివారున వెలసిన దుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వరలక్ష్మీ వ్రత ఆహ్వాన పత్రికల పంపిణీ

కిర్లంపూడి, ఆగస్టు 25: అన్నవరం దేవస్థానంలో ఈనెల 30న మహిళలకు ఉచిత వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించనున్నారు. వ్రతాల ఆహ్వాన పత్రికలను మండలంలో మహిళలకు సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు అందించారు.